సాక్షి
బాపట్ల
ఆదివారం । 8 । డిసెంబర్ । 2024



సాతులూరులో వైద్యశిబిరం

నాదెండ్ల: సాతులూరు జెడ్పీ హైస్కూలులో శనివారం బాపట్ల కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించారు.



వైభవంగా అయ్యప్ప పడి పూజ

చుండూరు(వేమూరు): మండలంలోని చినపరిమిలోని శ్రీ గంగా పార్వతీ శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి వైభవంగా పడి పూజ నిర్వహించారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు



నత్రశాల(రెంటచింతల): నత్రశాలలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'వాటర్ హీరో'కు అవార్డు ప్రదానం



తెనాలి: దేశంలో జల సంరక్షణ, వాననీటి సేకరణ, గ్రామీణ అభివృద్ధి రంగాల్లో గణనీయమైన కృషి చేసిన వ్యక్తులకు గౌరవంగా ఇచ్చే గ్లోబల్ వాటర్ ట్రాన్స్‌పర్సాలిటీ అవార్డు-2024ను తెనాలికి చెందిన 'వాటర్ హీరో' డాక్టర్ పొదిలి రాజశేఖరరాజు స్వీకరించారు. కేంద్రప్రభుత్వ వివిధ మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో ఇండియా వాటర్ ఫౌండేషన్ నిర్వహణలో ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన రెండురోజుల అంతర్జాతీయ సదస్సులో శుక్రవారం సాయంత్రం ముగింపు సభ జరిగింది. ఇందులో రాజశేఖరరాజు ఈ గౌరవాన్ని అందుకున్నారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి అవార్డును ప్రదానం చేశారు.

రేపు ఏఎన్‌యూలో ఎల్ఎల్‌బీ స్పాట్ అడ్మిషన్లు


ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో న్యాయ శాస్త్ర విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ ఎల్ఎల్‌బీ హానర్స్, బీబీఏ ఎల్ఎల్‌బీ హానర్స్ కోర్సులలో ఈ నెల 9వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. యూనివర్సిటీ అడ్మిషన్‌ల డైరెక్టర్ డాక్టర్ పి.బ్రహ్మాజీరావు ఈ విషయాన్ని శనివారం తెలిపారు. ప్రవేశాలకు ఇంటర్మీడియట్ అర్హత ప్రామాణికం అన్నారు. నేరుగా అడ్మిషన్ కార్యాలయానికి వచ్చి ప్రవేశాలు పొందవచ్చునని తెలిపారు. ఏపీ లాసెట్ రాయని వారికి కూడా అర్హత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

తల్లికి వందనం పథకం అమలు చేయాలి



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. తహసీల్దార్ సునీత, ఎంపీడీవో భార్గవి, ఎంఈవో-1 శ్రీనివాసరావు, ఎంపీపీ షేక్ జబీనా, జెడ్పీటీసీ మేకతోటి అరుణ, తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా మేకతోటి అరుణ మాట్లాడుతూ... గత ప్రభుత్వం గవర్నమెంట్ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఐక్యరాజ్యసమితి వేదికల్లో మాట్లాడే అవకాశం కల్పించిందని గుర్తుచేశారు. అది చాలా గొప్ప విషయం అన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన వంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఆర్థికంగా భరోసా కల్పించిందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం తల్లికి వందనం కార్యక్రమాన్ని అమలు చేయాలని కోరారు. అంతలో అత్యుత్సాహం చూపిస్తూ ఎంఈఓ-2 కాజ లక్ష్మీనారాయణ స్పందించారు. రాజకీయాలు మాట్లాడవద్దంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. పాఠశాలలో అభివృద్ధి పనులను రాజకీయాలు చేస్తున్నది అధికారులే అని, ఒక మహిళనైన తనను పలు సందర్భాలలో గౌరవించకపోవడం గురించి ఆమె నిలదీశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు వివిధ శాఖ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు జీవితంలో ఎదగాలి



మేడికొండూరు: మండల కేంద్రమైన మేడికొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ - టీచర్స్ సమావేశం శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పాల్గొన్నారు. డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ.. ఈ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయటం గొప్ప విషయమన్నారు. గతంలో ఇలాంటి కార్యక్రమాలు జరగలేదన్నారు. విద్యార్థులు స్టేజీ ముందు కాక స్టేజీపై కూర్చునే స్థాయికి ఎదగాలన్నారు. ఇష్టమైన సబ్జెక్ట్‌ను ఉపాధ్యాయుల సహకారంతో లోతుగా అధ్యయనం చేయాలని సూచించారు. అందరు విద్యార్థులను ముందుకు నడిపించగలిగే వారే ఉపాధ్యాయులని పేర్కొన్నారు. పిల్లల కోసం కన్నవారు కొంత సమయం కేటాయించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి మాట్లాడుతూ.. హాజరు శాతాన్ని బట్టి ప్రతి ప్రభుత్వ పాఠశాలకు ర్యాంకింగ్ ఏర్పాటు చేశారని, ప్రస్తుతం మేడికొండూరు పాఠశాల హాజరు శాతంలో ఒకటో స్టార్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో మూడవ స్టార్‌లో ఉందని చెప్పారు.

చదువుకున్నవారు

పిల్లల్ని కనడం లేదు

- బాపట్ల నుంచి పిలుపునిస్తున్నా.. పాపులేషన్ మేనేజ్‌మెంట్ అమలు చేయాలి
- ఐటీని నేనే తెచ్చా.. నేను ఆలోచించాకే సెల్‌ఫోన్‌లు వచ్చాయి
- మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు
- చంద్రబాబు మాటలకు విస్తుపోయిన ప్రజలు
- స్వోత్కర్షతో కూడిన సుదీర్ఘ ప్రసంగంతో విసిగిపోయిన వైనం
- ఆకలితో అల్లాడిన విద్యార్థులు, తల్లిదండ్రులు

ప్రతి ఒక్కరూ ఇద్దరికి తగ్గకుండా కనాలి



బాపట్ల మున్సిపల్ పాఠశాలలో ముగ్గులు తిలకిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ప్రతి ఆడబిడ్డ ఇద్దరికి తక్కువకాకుండా పిల్లలకు జన్మనివ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శనివారం బాపట్ల మున్సిపల్ పాఠశాలలో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల మెగా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తగ్గుతున్న జనాభాకు అనుగుణంగా ఆడబిడ్డలు ఎక్కువమందికి జన్మనివ్వాలని మరోమారు చెప్పారు. ప్రస్తుతం దేశంలో జనాభా ఉత్పత్తి 1.9 శాతం మాత్రమే ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇది 1.7 శాతం ఉండగా బాపట్లలో 1.45 శాతానికి పడిపోందన్నారు. జనం లేకపోతే ఊరుకూడా ఉండదన్నారు. దీనిని బట్టి చూస్తే జనాభా మరింతగా తగ్గిపోతుందన్నారు. ఈ విషయాన్ని గమనించి తాను 2019లో చెబితే అందరూ ఎగతాళి చేశారన్నారు. ఇప్పుడు అందరూ ఫ్యామిలీ ప్లానింగ్ చేసుకొని ఒక్కబిడ్డకే పరిమితమవుతున్నారన్నారు. కొందరు చదువుకున్నవారు అసలు పిల్లలనే కనడం లేదన్నారు. ఆదాయం రెండింతలుగా పెరిగినా ఖర్చు పెట్టుకొని ఎంజాయ్ చేస్తున్నారు తప్పించి పిల్లల్ని కనడంలేదన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే 2047 నాటికి దేశంలో, రాష్ట్రంలో కేవలం వృద్ధులు మాత్రమే మిగులుతారని, వారు మరణించాక ఎవరూ ఉండరన్నారు. అందుకే ప్రతి ఆడబిడ్డ ఇద్దరికి తగ్గకుండా బిడ్డలను కనాలన్నారు. చైనా, జపాన్, కొరియా, యూరోప్‌లలో పిల్లలు లేరన్నారు. అక్కడ చిన్నపిల్లలకు బదులు బొమ్మలు మాత్రమే ఉంటున్నాయన్నారు. అందుకే ముందు జాగ్రత్తగా అందరూ పిల్లల్ని కనాలన్నారు. బాపట్ల నుంచి పిలుపునిస్తున్నా.. ఇక నుంచి పాపులేషన్ మేనేజ్‌మెంట్ అమలు చేయాలన్నారు.

చంద్రబాబు మాటలకు ఘొల్లుమన్న జనం..

చంద్రబాబు మాటలకు సమావేశానికి వచ్చిన పురుషులతోపాటు మహిళలు సైతం పలుమార్లు నవ్వుకున్నారు. ఐటీ తాను పెట్టిందేనని చంద్రబాబు మరోమారు చెప్పారు. తాను ఐటీని తీసుకురావడంవల్లే హైదరాబాద్ అభివృద్ధి సాధించిందన్నారు. తాను ఆలోచించిన తర్వాతే సెల్‌ఫోన్‌లు వచ్చాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన టెక్నాలజీ, అభివృద్ధి మొత్తం తాను తెచ్చిందేనని చంద్రబాబు చెప్పడంపై సభికులు వ్యంగంగా చర్చించుకోవడం కనిపించింది.

విద్యార్థులతో ముఖాముఖి..

తొలుత ఉదయం 11గంటల ప్రాంతంలో బాపట్ల మున్సిపల్ పాఠశాలకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యాశాఖ మంత్రి లోకేష్‌తో కలిసి పాఠశాలను పరిశీలించారు. కొందరు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యాబోధన తీరును అడిగి తెలుసుకున్నారు. పిల్లలను చదువులో ప్రోత్సహించాలని సూచించారు. చదువుతో పాటు ఆటలకూ ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రత్యేక యాప్ ద్వారా పిల్లల పరిస్థితులను, ప్రోగ్రెస్‌ను తల్లిదండ్రులకు తెలపాలన్నారు. డిగ్రీ చదివిన వారిని ఐటీ జాబ్ చేస్తే డబ్బులు సంపాదించుకునేలా అవకాశం కల్పిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులు వేసిన ముగ్గులను పరిశీలించి అభినందించారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో ఆటలను ప్రారంభించి కొద్దిసేపు తిలకించారు. అనంతరం వేదిక వద్ద కొందరు విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటల వరకూ చంద్రబాబు చెప్పిందే చెప్పి సభను కొనసాగించడంతో సమావేశానికి వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు ఆకలితో ఇబ్బందులు పడ్డారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితోపాటు మంత్రి లోకేష్, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే నరేంద్రవర్మ, విద్యాశాఖ కార్యదర్శి శశిధర్, కమిషనర్ విజయరామరాజు, కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియంలో ఆడుకోనివ్వడం లేదు..

బాపట్ల: మున్సిపల్ హైస్కూలు ఆవరణలో ఏర్పాటు చేసిన మినీ స్టేడియంలో తమను ఆడుకోనివ్వటంలేదని పదోతరగతి విద్యార్థి సంతోష్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువచ్చాడు. మున్సిపల్ హైస్కూలులో ఏర్పాటు చేసిన సభలో విద్యార్థి సంతోష్ మాట్లాడారు.. ఆటలు ఆడుకునేందుకు స్థలం ఉన్నప్పటికీ కిట్లు లేవని, ఆట స్థలంలో వివిధ ఆటలకు సంబంధించిన పరికరాలు అందించాలని కోరాడు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జోక్యం చేసుకుని ఆటలు ఆడుకునేందుకు ఎవరికీ అభ్యంతరంలేదని, ఇంకా నిధులు ఇస్తామని చెప్పారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన డిజిటల్ గ్రంథాలయాలు, ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.



విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న చంద్రబాబు

తండ్రి ప్లేటు తీసిన లోకేష్..



చంద్రబాబు ప్లేటును తానే తీస్తున్న మంత్రి లోకేష్

బాపట్ల మున్సిపల్ పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా స్టూడెంట్స్, పేరెంట్స్, టీచర్స్ (ఎస్‌పీటీపీ) ప్రభుత్వ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఆయన తనయుడు లోకేష్ భక్తిభావాన్ని చాటుకున్నారు. సమావేశం అనంతరం విద్యార్థులతో కలిసి సీఎం చంద్రబాబు, లోకేష్‌లు భోజనం చేశారు. ఆ తర్వాత లోకేష్ తన ప్లేటుతోపాటు చంద్రబాబు విడిచి పెట్టిన ప్లేటును తీసుకొని వెళ్లారు. దీనిని అందరూ ఆసక్తిగా తిలకించారు.

టీడీపీ నేతల దౌర్జన్యకాండ

- అంగన్‌వాడీ టీచర్‌పై చెప్పుతో దాడి
- అడ్డువచ్చిన ఆమె తండ్రి పైనా దాడి
- బాధితుల పైనే కేసు పెట్టేందుకు టీడీపీ నేతల సన్నాహం
- ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- తమను వేధించి రాజీనామాలు చేయించారన్న అంగన్‌వాడీ టీచర్, యానిమేటర్



తాడపనేని అక్కయ్యను పరామర్శించి రిపోర్టులు పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



హాస్పిటల్ ఆవరణలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, యానిమేటర్ విజయలక్ష్మి

నరసరావుపేట: అధికారం మాటున టీడీపీ నేతల దౌర్జన్యకాండకు అంతులేకుండా ఉంది. అంగన్‌వాడీ టీచర్‌పై చెప్పుతో దాడి చేయడమే కాకుండా అడ్డు వచ్చిన ఆమె తండ్రిపై దౌర్జన్యం చేశారు. అంగన్‌వాడీ టీచర్‌తో పాటు యానిమేటర్‌తో బలవంతంగా రాజీనామాలు చేయించారు. బాధితులకు వైఎస్సార్ సీపీ అండగా నిలిచింది. అంగన్‌వాడీ టీచర్ టి.విజయలక్ష్మిని చెప్పుతో కొట్టి కంటిని గాయపర్చి, అడ్డు వచ్చిన ఆమె తండ్రి తాడపనేని అక్కయ్యపై దాడిచేసి గాయపర్చిన తెలుగుదేశం నాయకులపై కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం కర్లగుంటలో శుక్రవారం టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని మండల నాయకులతో కలిసి శనివారం ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ విజయలక్ష్మి కుటుంబం వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నదనే కారణంతోనే దాడి జరిగిందని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టుకు రాజీనామా చేస్తావా.. లేదా ? అంటూ గత మూడు నెలలుగా ఆమెను నానా రకాలుగా వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. దీనికి నిరాకరిస్తుండటంతో ఐ.శ్రీనివాసరావు మరి కొందరు ఆమె ఇంటిపై దాడిచేసి కొట్టారని చెప్పారు. అడ్డువచ్చిన ఆమె తండ్రి, బైపాస్ ఆపరేషన్ చేయించుకున్న వృద్ధుడైన అక్కయ్యను కూడా కొట్టారని తెలిపారు. బాధితులు ప్రస్తుతం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. యాభై మంది టీడీపీ నాయకులు, వారి మద్దతుదారులు వచ్చి కేసు ఫైల్‌ను మార్చి తిరిగి వారిపైనే కేసు పెట్టే విధంగా రిపోర్టు తయారు చేయాలని వైద్యులపై ఒత్తిడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ మార్పిడి వంటి కార్యక్రమాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గోపిరెడ్డి హెచ్చరించారు. ఈ సంఘటనతో రాష్ట్రంలో మహిళలకు ఏ మాత్రం రక్షణ లేదనే విషయం తేటతెల్లమవుతోందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్‌లు తక్షణమే స్పందించాలని కోరారు.

టీడీపీ వర్గీయులు దాడిచేశారు

బాధితురాలైన అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఐ. శ్రీనివాసరావు మరికొందరు తన ఇంటిపై దాడిచేసి చెప్పుతో కొట్టి కంటిని గాయపరిచారని తెలిపారు. తాము వైఎస్సార్ సీపీ సానుభూతిపరులం కావడం, అంగన్‌వాడీ టీచర్‌గా రాజీనామా చేయకపోవడమే కారణమని తెలిపారు. అక్కయ్య కుమారుడు తాడపనేని సందీప్ మీడియాతో మాట్లాడుతూ తాము వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉంటామని, ఈ రకంగా భౌతిక దాడులకు పాల్పడుతూ భయపెట్టడం కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలేనని చెప్పారు. గతంలో టీడీపీ వర్గీయుల వేధింపులకు గురై యానిమేటరు పదవికి రాజీనామా చేసిన విజయలక్ష్మి మాట్లాడుతూ తనను కూడా గతంలో ఇదే విధంగా టీడీపీ నాయకులు బెదిరించి బలవంతంగా రాజీనామా చేయించారని వాపోయారు. అనేక రకాలుగా హింసలు పెట్టి వేధింపులకు గురి చేశారని తెలిపారు. ఆడిట్ రిపోర్టు చూపించినా వినలేదని, రెండు వందల మంది ఇంటిపైకి వచ్చారని, తాను ఆత్మహత్య చేసుకోవాలన్నంత బాధ కలిగిందని వాపోయారు. కర్లగుంటలో మహిళలపై రాజకీయ కక్ష సాధింపు చర్యలతోనే కేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ గోపిరెడ్డి వెంట పార్టీ మండల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, పానుగోటి వెంకటరావు, రామిరెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ సభా?.. పచ్చ పార్టీ సమావేశమా?

- చీరాలలో టీడీపీ సమావేశాన్ని తలపించిన పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్
- వేదికపై ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నాయకులు



ఎన్ఆర్‌పీఎం హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు వేదికపై టీడీపీ నాయకులు

చీరాల: ఎలాంటి లక్ష్యం లేకుండా చేపట్టిన పేరెంట్స్-టీచర్స్ సమావేశాలకు స్పందన అంతంతమాత్రంగానే కనిపించింది. అసలు విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిన కూటమి ప్రభుత్వం ఏం చేయడానికి ఇలాంటి కార్యక్రమం పెట్టిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని ఎన్ఆర్‌పీఎం హైస్కూల్‌లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొన్న ఈ సమావేశం రాజకీయ సభను తలపించింది. వేదికను పసుపుమయం చేశారు. ఎటువంటి రాజకీయాలకు తావులేకుండా నిర్వహించాలని ప్రభుత్వం సూచించినా రాజకీయ నాయకులు ఎక్కువ మంది పాల్గొని, రాజకీయ ప్రసంగాలతో ఊదరగొట్టారు. తల్లికి వందనం క్రింద ప్రభుత్వం తల్లుల ఖాతాలో జమ చేయాల్సిన నగదుపై ప్రస్తావన లేకుండా కార్యక్రమాలు నిర్వహించడంపై విద్యార్థుల తల్లులు పెదవి విరుస్తున్నారు. చేనేత సహకార సంఘాల సమైక్య చైర్మన్ డాక్టర్ సజ్జా హేమలత, హెచ్‌ఎం ఎ.వెంకటేశ్వరరావు, ఎంఈఓ-2 సుధారాణి, విద్యాకమిటీ చైర్మన్ వై.వెంకటరమణ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్రాచీన కట్టడాల పరిరక్షణ అందరి బాధ్యత

ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డెప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ సాంబశివ కుమార్



భట్టిప్రోలు బౌద్ధస్థూపం వద్ద జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న మల్లెల సాంబశివకుమార్

భట్టిప్రోలు: ప్రాచీన కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డెప్యూటీ సూపరింటెండెంట్ ఇంజినీర్ మల్లెల సాంబశివకుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన భట్టిప్రోలు బౌద్ధస్థూపాన్ని సందర్శించి ఆవరణలో జరుగుతున్న మరమ్మతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. భట్టిప్రోలులోని అతి పురాతనమైన బుద్ధుని అస్తికలపై నిర్మించిన బౌద్ధస్థూపానికి చరిత్రలో ఎంతో పేరు ఉందని అన్నారు. జాతి సంపదను కాపాడుకునే దిశగా ప్రతి పౌరుడు ఆలోచన చేయాలని కోరారు. పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ దివంగత డాక్టర్ జితేంద్రదాస్ భట్టిప్రోలు, అమరావతి, జగ్గయ్యపేట, గుంటుపల్లి తదితర బౌద్ధక్షేత్రాల అభివృద్ధికి కృషి చేశాడన్నారు. భట్టిప్రోలు స్థూపం పూర్వాకృతి కోల్పోకుండా ఏర్పాటు చేసిన అండర్ పోర్షన్ మరమ్మతుల ప్రక్రియ ప్రత్యేకంగా గానుగ సున్నంతో చేయిస్తున్నట్లు చెప్పారు. బౌద్ధ స్థూపం చుట్టూ ఫెన్సింగ్ కట్టుదిట్టం చేయనున్నట్లు తెలిపారు. అండర్ పోర్షన్ కోసం ప్రత్యేకమైన ఇటుకలను నాగార్జున సాగర్ నుంచి తెప్పించడం జరిగిందని చెప్పారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన స్మారకంగా నిర్మించిన ప్రాచీన కట్టడం సంరక్షణార్థం 100 మీటర్లలోపు కట్టడాలు పూర్తిగా నిషేధమన్నారు. 100 నుంచి 200 మీటర్ల లోపు కట్టడాలు చేస్తే నేషనల్ మాన్యుమెంట్ డిపార్ట్‌మెంట్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఆయన వెంకట కన్జర్వేషన్ అసిస్టెంట్ యు. వెంకటయ్య, మల్టీ టాస్క్ స్టాఫ్ (ఎంటీఎస్) విక్రమ్ సర్కార్, సిబ్బంది ఉన్నారు.

విదేశీ వధువు.. తెనాలి వరుడు..



పెళ్లిపీటలపై వధూవరులు అవినాష్-క్రిస్టినా

సంప్రదాయ వివాహంతో ఒక్కటైన ప్రేమజంట

తెనాలి: ప్రేమకు కులమతాలే కావు... ఎల్లలు కావని డెల్టాలోని పలువురు ఎన్నారైలు చాటుతున్నారు. దేశం కాని దేశంలో చిగురించిన ప్రేమతో స్వస్థలంలో కుటుంబసభ్యులు, బంధుమిత్రుల మధ్య పెళ్లిబాజాల హోరులో ఒక్కటి అవుతున్నారు. సంప్రదాయాలను ఆచరిస్తూ తమ ప్రేమను పరిపూర్ణం చేసుకుంటున్నారు. ఆ క్రమంలోనే శనివారం తెనాలికి చెందిన అవినాష్, గ్రీస్ దేశానికి చెందిన క్రిస్టినా మూడుముళ్ల బంధంతో దంపతులయ్యారు. స్థానిక చెంచుపేటలోని కళ్యాణమండపం ఇందుకు వేదికైంది. పట్టణంలోని గంగానమ్మపేటకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పేరుబోయిన ఆంజనేయులు-నాగజ్యోతి కుమారుడు అవినాష్ బీటెక్ చేశాక, ఐర్లాండ్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. గ్రీస్ యువతి క్రిస్టినా కూడా అక్కడే కొలువులో ఉన్నారు. వీరి పరిచయం ప్రేమకు దారితీసింది. పెళ్లితో నూరేళ్లు కలిసి జీవించాలని నిర్ణయం తీసుకున్నారు. తమ మనోభావాన్ని పెద్దలకు తెలియజేశారు. వారు సంతోషంగా అంగీకరించారు. పెద్దలు నిశ్చయించిన సుముహూర్తానికి శనివారం వీరి వివాహం వైభవంగా జరిగింది. క్రిస్టినా తల్లి లొకియా మెరిస్వరటౌతోపాటు సోదరి కూడా హాజరయ్యారు.

ప్రజలపై విద్యుత్ చార్జీల బాదుడే బాదుడు

వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబు



భట్టిప్రోలు: కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రెండుసార్లు విద్యుత్ బిల్లుల భారాన్ని మోపి, ప్రజలపై బాదుడే బాదుడు అమలు చేసిందని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. శనివారం భట్టిప్రోలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014-2019 టీడీపీ ప్రభుత్వ హయంలో చంద్రబాబు యూనిట్ రూ.5.10కు కొనుగోలు చేస్తే,గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేవలం రూ.2.49కే యూనిట్‌ను కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఈ తేడాను గమనిస్తే ఎవరు అవినీతికి పాల్పడ్డారో తెలుసుందన్నారు. ప్రస్తుతం నిత్యావసరాల ధరలు అమాంతం పెంచేయడంతో పేదలు రెండు పూటలా అన్నం తినలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. దీనికి తోడు విద్యుత్ ఛార్జీలు పెంచి వారిపై మరింత భారం మోపడం దారుణమన్నారు. ఈ నెల 11న రైతుల సమస్యలపై కలక్టరేట్లలో విజ్ఞాపన పత్రాలు, 27న పెంచిన కరెంట్ చార్జీలపై ఎస్ఈ కార్యాలయాలకు ప్రజలతో వెళ్లి విజ్ఞాపన పత్రాలు, జనవరి 3న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలంటూ విద్యార్థులతో కలసి వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **2,700** గరిష్ఠం : రూ. **3,500**

మోడల్ ధర రూ. **3,100**

డాక్టర్ అంజయ్యకు విశ్వగురు జాతీయ పురస్కారం



గుంటూరు మెడికల్: విశ్వ గురు వరల్డ్ రికార్డ్ సంస్థ జాతీయ స్థాయి కామధేను అవార్డుకు గుంటూరుకు చెందిన డాక్టర్ అంజయ్యను ఎంపిక చేసింది. వైద్య రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బందెల అంజయ్య కర్నూలు జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, ఒంగోలు రిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్‌గా పని చేశారు. ప్రస్తుతం కాటూరి మెడికల్ కాలేజీలో గౌరవ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన రాసిన వైద్య గ్రంథాలలో క్లీనికల్ పీడియాట్రిక్, క్లీనికల్ పీడియాట్రిక్ కార్డియాలజీ, క్లీనికల్ మెథడ్ ఇన్ పీడియాట్రిక్ తదితరాలు ఉన్నాయి. గతంలో మదర్ థెరిస్సా మెమోరియల్ అవార్డు, గ్రంథాలయ అవార్డు, ఏడు సార్లు బెస్ట్ డాక్టర్ అవార్డు, రాష్ట్రస్థాయి ఉత్తమ టీచర్ అవార్డు, గత నెల 4న గుంటూరులో జరిగిన పట్టాభి కళాపీఠం అవార్డు అందుకున్నారు. ఈ నెల 8న హైదరాబాద్‌లోని బేగంపేట టూరిజం ప్లాజాలో విశ్వగురు వరల్డ్ రికార్డు సీఈఓ డాక్టర్ సత్యవోలు రాంబాబు చేతుల మీదుగా డాక్టర్ బందెల అంజయ్య అవార్డు అందుకోనున్నారు. డాక్టర్ అంజయ్యను గుంటూరు పట్టాభి కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తుములూరి రాజేంద్రప్రసాద్, ఎయిల్ రివైవల్ ఫోరమ్ సభ్యులు నిరీక్షణ రావు, శిఖామణి, సుధాకర్, రాజు, ప్రసన్నబాబు, భానురంజిత్, ఏలియా తదితరులు అభినందించారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం

మెగా పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ మంత్రి అనగాని

చెరుకుపల్లి: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు పోటీతత్వాన్ని అలవర్చుకుని విద్యలో రాణించాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని చెరకుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సందర్భంగా సత్యప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో అన్ని పాఠశాలల్లో ఈ మెగా పేరెట్స్ టీచర్స్ మీట్ నిర్వహించటం జరుగుతుందన్నారు. పాఠశాల ఆవరణలోనే తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు, అనంతరం పాఠశాల అభివృద్ధికి సహకరించిన పూర్వ విద్యార్థులను, గ్రామ పెద్దలను ఉత్తమ ఉపాధ్యాయులను సత్యప్రసాద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు మరివాడ వెంకట పావని, తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ఎంపీడీఓ షేక్ సుభాని, ఎంఈఓ టి.నవీన్‌కుమార్, స్థానిక సర్పంచ్ దేవరకొండ వాణి, జనసేన రేపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త మత్తి భాస్కరావు, హెచ్‌ఎం కాటూరి లక్ష్మీ నారాయణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి విద్యమూలం

రేపల్లె రూరల్: సమాజాభివృద్ధికి విద్య మూలమని యూనియన్ బ్యాంక్ ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల డీజీఎం, పాఠశాల పూర్వ విద్యార్థి అమిరినేని సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం మండలంలోని నల్లూరుపాలెం జడ్పీ హైస్కూలులో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మెగా సమావేశంలో ఆయన మాట్లాడారు. విలువలతో కూడిన విద్యను అలవర్చుకున్నప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోగలరన్నారు. చిన్నప్పటి నుంచి క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన జరగాలని, అప్పుడే విద్యార్థులకు జ్ఞానాభివృద్ధి పెంపొంది, సమాజాభివృద్ధికి పాటుపడగలరన్నారు. అనంతరం విద్యార్థుల తల్లులకు రంగోలీ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు, తల్లులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొరికపూడి నాంచారమ్మ, ఎంపీటీసీ గొరికపూడి దేవమణి, హెచ్‌ఎం నల్లూరి స్వర్ణలత, సీడీపీఓ సుచిత్ర, నల్లూరుపాలెం ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు వీరవల్లి శివరామకృష్ణ, ఎస్‌ఎంసీ చైర్మన్ పులివర్తి జనార్దనరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా బేతపూడిలో ఆది ఆంధ్ర ఎయిడెడ్ పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ కోడె గౌరీశంకర్ పర్యవేక్షణలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు.



వల్లాపల్లి ఎయిడెడ్ స్కూల్‌లో జరిగిన సమావేశానికి తక్కువ సంఖ్యలో హాజరైన పేరెంట్స్

తూతూమంత్రంగా పేరెంట్స్ మీటింగ్..

బల్లికురవ: ప్రభుత్వం శనివారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా పేరెంట్స్, టీచర్ల సమావేశాలకు స్పందన అంతంత మాత్రంగానే కనిపించింది. తల్లిదండ్రులు, వ్యవసాయపనుల్లో బిజీగా ఉండటం, తుఫాన్ హెచ్చరికలతో 30 నుంచి 40 శాతం మంది మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. మార్టూరు ఎంఈఓ–1కు ఇక్కడి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించటంతో ఆయన ఆ మండలానికే పరిమితం అయ్యారు. ఎంఈఓ–2, ఒకటి రెండు పాఠశాలలో జరిగిన సమావేశాలకు హాజరయ్యారు. వల్లాపల్లి ఎయిడెడ్ పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టుల రద్దుతో విద్యార్థుల సంఖ్య ఏడాదికేడాది గణనీయంగా తగ్గుతోంది. అక్కడ ఉన్న విద్యార్థులకు సంబంధించిన నలుగుదైగురు పేరెంట్స్ మాత్రమే ఈ సమావేశానికి హాజరయ్యారు.

విద్యార్థులకు పురుగుల అన్నం

- పేరెంట్స్ మీటింగ్ రోజే భోజనంలో పురుగులు
- ఉపాధ్యాయులపై మండిపడ్డ తల్లిదండ్రులు



విద్యార్థులకు వడ్డించిన అన్నంలో ఉన్న పురుగులు

అల్లూరు(కర్లపాలెం): తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంయుక్త సమావేశం అనంతరం ఓ పాఠశాలలో వడ్డించిన భోజనంలో పురుగులు కనపడటం కలకలం రేగింది. పురుగులు పడిన భోజనం పెడతారా అంటూ తల్లిదండ్రులు ఉపాధ్యాయులను, ఏజెన్సీ నిర్వాహకులను నిలదీసిన సంఘటన పిట్టలవానిపాలెం మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... ప్రభుత్వం శనివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సంయుక్త సమావేశం అల్లూరు మంతెన సత్యనారాయణ రాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. తల్లిదండ్రుల సమావేశం అనంతరం సుమారు 200 మందికి భోజనాలు వడ్డించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు భోజనాలు చేస్తున్న సమయంలో కొంతమంది ప్లేట్లలో పురుగులు కనపడటంతో భోజనం ప్లేట్లు పక్కన పడవేసి ఇలాంటి భోజనమా మా పిల్లలకు వడ్డించేది అని పాఠశాల ఉపాధ్యాయులపై, మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలకు తల్లిదండ్రులు వస్తున్నారని తెలిసి కూడా ఇలాంటి భోజనం పెటాట్టరంటే రోజు మా పిల్లలకు ఎలాంటి భోజనం పెడుతున్నారో అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

■ ఈ విషయమై పాఠశాల హెచ్‌ఎం పద్మారావును వివరణ అడగగా తమ పాఠశాలలో ఇలాంటి సంఘటన ఇంతకముందెన్నడూ జరగలేదని మంచి బియ్యమే భోజనానికి వినియోగిస్తున్నామని సాంబారులో వచ్చిందో చెట్టుపై నుంచి పడిందో తెలియటం లేదని చెప్పారు. 200 మంది భోజనం చేస్తే ఒకరి ప్లేటులోనే పురుగు కనిపించిందని ఇకపై ఇలా జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చురుగ్గా వెల్లటూరు చప్టా మరమ్మతులు

ఒక తడికి సాగునీరు అందించేలా చర్యలు



చప్టా దిగువున ఇసుక బస్తాలను నింపుతున్న దృశ్యం

భట్టిప్రోలు: వెల్లటూరు చానల్ పరిధిలో భట్టిప్రోలు మెయిన్ డ్రెయిన్‌పై ఇటీవల కూలిన చప్టా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. చప్టా తాత్కలిక మరమ్మతులను డీఈలు దీన్‌దయాళ్, జేఈ సువర్చల శనివారం పరిశీలించారు. పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. మరమ్మతులు నిర్వహించి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. ప్రస్తుతం దిగువకు ఒక తడి సాగునీరు అందించేందుకు చప్టా వద్ద ఇసుక బస్తాలతో నింపి, నీరు లీక్ కాకుండా టార్పాలిన్ పట్టాలు వేసి సాగునీరు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి సాగు నీరు అందించనున్నట్లు వివరించారు. ఈ కాల్వ ద్వారా భట్టిప్రోలు, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి ప్రాంతాల్లోని 30 వేల ఎకరాలకు పైగా పంట పొలాలకు సాగునీరు అందుతుంది. చప్టా కూలిపోవడంతో సాగు నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. ముఖ్యంగా నగరం మండలం దిగువ ప్రాంతంలో 10 వేల ఎకరాలకు పైగా పైరు లేత దశలో ఉండటంతో సాగునీరు అవసరమైంది.

రోప్ స్కిప్పింగ్‌లో తాడేపల్లి విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లిలోని గీతాంజలి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో సత్తా చాటారు. గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా శనివారం స్కూల్ కరస్పాండెంట్ రమాదేవి వారిని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ... ఇండియన్ రోప్ స్కిపింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 3వ తేదీ వరకు గోవాలో జాతీయ స్థాయి పోటీల్లో టి. హేమ శివశంకర్, సీహెచ్ మోక్ష అండర్ – 10 విభాగంలో స్పీడ్ డబుల్ అండర్ ఫ్రీ స్టైల్ కేటగిరీలో గోల్డ్ మరియు సిల్వర్ మెడల్స్ సాధించారని తెలిపారు. విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు పి. తిరుపతి రావును అభినందించారు.



విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న కరస్పాండెంట్ రమాదేవి

నగదు కాజేసి.. బెట్టింగ్ యాప్‌లో జమ చేసి..

- సైబర్ ముఠాకు సహకరిస్తున్న ముగ్గురి అరెస్ట్
- లోన్ ఇస్తామని అమాయకులను దోచుకుంటున్న సైబర్ నేరగాళ్లు
- కాజేసిన నగదును బెట్టింగ్ అప్లికేషన్ వాలెట్‌లోకి జమ
- నగదు బదిలీకి సహకరిస్తున్న బెట్టింగ్ అప్లికేషన్ ఫ్రాంచైజీ గ్యాంగ్

విశాఖ సిటీ: నిషేధిత బెట్టింగ్ అప్లికేషన్ నిర్వహిస్తూ.. నకిలీ లోన్ నిర్వాహక ముఠాకు సహాయం చేస్తున్న మోసగాళ్లకు సైబర్ క్రైం పోలీసులు చెక్ పెట్టారు. బెట్టింగ్ అప్లికేషన్ ఫ్రాంచైజీ తీసుకున్న వ్యక్తితో పాటు అతని సహాయకులిద్దరిని శనివారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. వైజాగ్‌కు చెందిన శరగడం మోహనరావు అనే వ్యక్తి తన వ్యక్తిగత అవసరాల కోసం రుణం తీసుకోడానికి ఆన్‌లైన్‌లో పలు అప్లికేషన్లను పరిశీలించాడు. ఇందులో ఇండియన్ బుల్స్ అనే అప్లికేషన్‌లో తన వ్యక్తిగత వివరాలు, మొబైల్ నంబర్‌ను నమోదు చేశాడు. కొద్దిసేపటికే నకిలీ లోన్ కంపెనీ అయిన ఇండియన్ బుల్స్ ప్రతినిధుల నుంచి మోహనరావుకు కాల్ వచ్చింది. లోన్ ఇస్తామని చెప్పి నమ్మించారు. అయితే డాక్యుమెంటేషన్, ఎన్‌ఓసీ, జీఎస్టీ చార్జీల పేరుతో కొంత నగదు జమ చేయాలని చెప్పారు. వారి మాటలు నమ్మిన మోహనరావు దఫదఫాలుగా రూ.3.42 లక్షలు నేరగాళ్లు చెప్పిన ఖాతాలోకి జమ చేశాడు. అయినప్పటికీ తనకు లోన్ రాకపోవడంతో మోసపోయానని గ్రహించి వెంటనే సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి సాంకతికత సహాయంతో దర్యాప్తు చేపట్టగా.. విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.

సుమారు రూ.20కోట్ల మేర లావాదేవీలు!

సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి కాజేసిన నగదును దేశంలో నిషేధించిన దుబాయ్‌కు చెందిన స్పింటర్ ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్ అప్లికేషన్ ఖాతాలోకి బదిలీ చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. వాస్తవానికి ఈ బెట్టింగ్ అప్లికేషన్ వాలెట్‌లోకి నగదు జమ చేయాలంటే.. ఆ బెట్టింగ్ అప్లికేషన్‌ను ఫ్రాంచైజీ తీసుకున్న వారి సహాయం అవసరం. ఈ కోణంలో దర్యాప్తు చేయగా విజయవాడకు చెందిన పొట్టి శివ పాండురంగారావు బెట్టింగ్ ఫ్రాంచైజీని కలిగి ఉన్నట్లు తెలుసుకున్నారు. అతను సైబర్ నేరగాళ్లతో సంప్రదింపులు జరిపి.. బాధితుల నుంచి కాజేసిన నగదును బెట్టింగ్ అప్లికేషన్ వాలెట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాడు. ఆ తర్వాత ఆ నగదును నేరగాళ్ల గేమింగ్ వాలెట్ ఐడీలోకి జమ చేస్తున్నాడు. అనంతరం నేరగాళ్లు విత్‌డ్రా రిక్వెస్ట్ పెట్టుకుని.. వారికి కావాల్సిన ఖాతాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేసుకుంటున్నట్లు పోలీసులు గుర్తించారు. పాండురంగారావు ఈ బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహించడం కోసం డబ్బులు అవసరమున్న రకరకాల వ్యక్తులను సంప్రదిస్తున్నాడు. వారితో ఖాతా ఓపెన్ చేయించి.. వారికి కొంత నగదు ఇచ్చి వారి పేర్ల మీద అకౌంట్లు నిర్వహిస్తూ బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. నేరగాళ్ల వివిధ వ్యక్తుల నుంచి సేకరించిన 6 మ్యూల్ ఖాతాలు పరిశీలించగా సుమారు రూ.20కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఇందులో కమీషన్ రూపంలో నిందితులకు రూ.80 లక్షల వరకు గత ఏడాదిన్నర కాలంలో వచ్చినట్లు ఆధారాలు సేకరించారు.

రుషికొండలో ముగ్గురు అరెస్ట్..

బెట్టింగ్ అప్లికేషన్ ఫ్రాంచైజీ తీసుకున్న విజయవాడకు చెందిన పొట్టి శివపాండురంగారావు, అతనికి సహాయకులుగా పనిచేస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలానికి చెందిన ఈరె గోవిందకుమార్, బాపట్ల జిల్లా రేపల్లె మండలానికి చెందిన పట్టంశెట్టి వెంకట సాయి మణికంఠను సైబర్ క్రైం పోలీసులు రుషికొండ వద్ద ఓ హోటల్‌లో అరెస్ట్ చేశారు. వారి నుంచి బెట్టింగ్ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్న 9 సెల్‌ఫోన్లు, 2 ల్యాప్ టాప్‌లు, రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు
- నరసరావుపేటలో ప్రారంభమైన 25వ పల్నాడు జిల్లా మహాసభలు



మహాసభలో మాట్లాడుతున్న బాబూరావు

నరసరావుపేట: ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేయాలని పార్టీ ప్రతినిధులకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు సీహెచ్.బాబూరావు పిలుపు ఇచ్చారు పార్టీ పల్నాడు జిల్లా 25వ మహాసభలు శనివారం పట్టణంలోని ప్రకాష్‌నగర్ షాదీఖానాలో జమండ్లమూడి లింగరావునగర్, బొల్లు శంకరరావు ప్రాంగణంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభ సూచికగా సభా ప్రాంగణంలో సీనియర్ నాయకులు ఏవీకె దుర్గారావు పార్టీ జెండా ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపం వద్ద ఇటీవల మృతి చెందిన అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి, సీనియర్ కామ్రేడ్ బొల్లు శంకరరావు, కామ్రేడ్ జమండ్లమూడి లింగరావు చిత్రపటాలకు రాష్ట కార్యదర్శి వర్గసభ్యులు బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, కె.హరికిశోర్, పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్, సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా నాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలు ఆలపించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఏపూరి గోపాలరావు, వై.రాధాకష్ణ, జి.రవిబాబు, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, ఎస్.ఆంజనేయనాయక్, పట్టణ కార్యదర్శి డి.శివకుమారి, 1వ, 2వ పట్టణ కార్యదర్శులు షేక్ సిలార్‌మసూద్, సయ్యద్ రబ్బాని పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కుకు రేపటి వరకు గడువు

నరసరావుపేట: గుంటూరు, కృష్ణా శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల జాబితాలో ఓటు కోసం ఈనెల తొమ్మిదవ తేదీలోగా ఫారం– 18ను సమర్పించి పేరు నమోదుచేసుకోవాలని ఎన్నికల అధికారి పర్యవేక్షకులు షేక్ ఖాజావలి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను గత నెల 23న అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రదర్శించామని తెలిపారు. ఈనెల 6వ తేదీ వరకు వచ్చిన క్లెయిములను విచారించి, అర్హత కల్గిన అర్జీదారులను డాఫ్ట్ జాబితాలో ఓటర్లుగా నమోదు చేశామని పేర్కొన్నారు. జాబితాను డీఆర్వో, తహసీల్దార్ల కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంచామని తెలిపారు. సదరు జాబితాపై అభ్యంతరాలను ఫారం–7ద్వారా, సవరణ కోసం ఫారం–8, ఓటరు నమోదు కోసం ఫారం–18లను ఈనెల తొమ్మిదిలోగా సమర్పించాలని షేక్ ఖాజావలి కోరారు.

దళారుల నుంచి రైతులను కాపాడాలి

పల్నాడు జేసీ గనోరేకు రైతు సంఘం నాయకుల వినతి



కలెక్టరేట్‌లో జేసీ గనోరేకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

నరసరావుపేట:. ధాన్యం కొనుగోలు సెంటర్లు వెంటనే ప్రారంభించి ధాన్యం బోకర్ల నుంచి రైతుల్ని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము కోరారు. గత ఏడాది ఈపాటికే ప్రభుత్వం కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేసి బస్తాను రూ.2200 కొనుగోలు చేసిందని తెలిపారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేకు వినతిపత్రం అందజేశారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం బస్తాను ప్రభుత్వమే కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించినా ఇప్పటివరకు ఆచరణకు నోచుకోలేదని తెలిపారు. ఇప్పటికే చాలామంది రైతుల ఇళ్లకు ధాన్యం వచ్చి ఉందని, ప్రభుత్వం కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేయకపోవడంతో బోకర్ల మాయలో పడి తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ధాన్యం బోకర్లు రైతులను మభ్యపెట్టి బస్తాను రూ.1500ల లోపే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేసినట్లయితే దళారీ వ్యవస్థ నుంచి రైతుల్ని కాపాడిన వారు అవుతారని వివరించారు. రైతుల ఆరుగాలం కష్టందోపిడీకి గురికాకుండా అరికట్టిన వారవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, సీనియర్ నాయకుడు రంగయ్య పాల్గొన్నారు.